క్లుప్తంగా

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా జ్యోతిరెడ్డి

ఆదిలాబాద్: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా చిల్కూరి జ్యోతిరెడ్డి నియామకమయ్యారు. జిల్లా కేంద్రంలోని గురువారం నిర్వహించిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో చిల్కూరి జ్యోతిరెడ్డిని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్ అధికార ప్రతినిధిగా ప్రకటించారు. ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

ఆదిలాబాద్: గిరిజన విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్ అన్నారు. గిరి విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీల్లో రాణించేందుకు అన్ని విధాలుగా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. క్యాంపులను విజయవంతంగా చేయడంలో శిక్షకులు, పీఈటీలు ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఏసీఎంవో జగన్, ఛాయా, నిహారిక, లక్ష్మణ్ పవార్, రవీందర్, దేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై అవగాహన ఉండాలి

నేరడిగొండ: సాగు పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏఈవోలు జైపాల్, సౌజన్య, గజేందర్, స్వర్ణలత, సంకీర్తనలు అన్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం మండలంలోని వడూర్, తేజాపూర్, సవర్గం, బుర్కపల్లి, నాగమల్యాల్, యాపల్‌గూడ గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గుర్తింపు పొందిన విత్తన డీలర్ల వద్ద నుంచే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేయాలని సూచించారు. తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పండరి, గ్రామస్తులు గాదె శంకర్, బుక రాములు, గంగారెడ్డి, కూన రాములు, నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

సేవింగ్స్ ఖాతాలు తెరవాలి

ఆదిలాబాద్: ఉపాధిహామీ కూలీలు సేవింగ్స్, ఐపీపీబీ (ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్) ఖాతాలను తెరవాలని ఆదిలాబాద్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఉమా మహేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ కూలీలు పనిచేసే చోట, ఇంటి వద్దనే ఉంటూ కూలి డబ్బులు పొందవచ్చన్నారు. ఆదిలాబాద్ డివిజన్ పరిధిలో 585 పోస్ట్ ఆఫీస్‌లు ఉన్నాయని, ఖాతాలను తెరవడానికి తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

‘ఎవరికీ డబ్బులు ఇవ్వలేదు’

బోథ్: దళితబంధు కోసం తాము ఎవరికీ డబ్బులు ఇవ్వలేదని మండలంలోని చింతల్‌బోరి గ్రామంలోని దళితబంధు లబ్ధిదారులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. కొంతమంది తాము డబ్బులు ఇచ్చామని చెప్పడం అబద్ధమన్నారు. ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆరోపణల్లో వాస్తవం లేదని మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్ సింగ్ అన్నారు. ఇప్పటికైనా నిజం తెలుసుకొని మాట్లాడాలన్నారు.

కెరీర్ గైడెన్స్‌కు స్పందన

బోథ్: మండలంలోని పొచ్చెర క్రాస్‌రోడ్డు వద్ద సాయి ఫంక్షన్ హాల్‌లో గురువారం సీపీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కెరీర్ గైడెన్స్ సదస్సుకు విద్యార్థుల నుంచి స్పందన లభించింది. పదో తరగతి, ఇంటర్ తరువాత ఏ కోర్సులో చేరాలి? ఉద్యోగావకాశాలు గురించి నిపుణులు రమణగౌడ్, సాయికృష్ణ వివరించారు. కార్యక్రమంలో సీపీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు చంటి, అప్పీల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి రాథోడ్ పార్వతి, ప్రమోద్ రెడ్డి, గొల్ల రమేష్, నవీన్, బానోతు కర్ణ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలపై విరిగిపడిన చెట్లు

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి ఈదురు గాలులు వీచాయి. భీంపూర్ మండలంలోని వడూర్ గ్రామ సమీపంలో 33 కేవీ విద్యుత్ లైన్ తీగలపై చెట్లు విరిగిపడ్డాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వడూర్, అర్లి, గోముత్రి, కరంజి గ్రామాల్లో విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

మైనార్టీ రాష్ట్ర కమిషన్ చైర్మన్‌ను కలిసిన సిరాజ్ ఉద్దీన్

ఆదిలాబాద్‌అర్బన్: రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీని ఆదిలాబాద్ సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు ఖాజా సిరాజ్ ఉద్దీన్ గురువారం నిజామాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. చైర్మన్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. మైనార్టీలకు ఇళ్ల పట్టాలు, డబుల్ బెడ్ రూంలు, ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలని కోరారు.

బాల్.. బాల్‌కు బెట్టింగ్



- ఐపీఎల్ మ్యాచ్‌లపై జోరుగా బెట్టింగ్
- స్మార్ట్‌ఫోన్లలో నిర్వహణ
- ఈ- వాలెట్ ద్వారా లావాదేవీలు
- ఆర్థికంగా నష్టపోతున్న యువత

గుడిహత్నూర్: ఐపీఎల్ బెట్టింగ్ జిల్లాలో జోరుగా సాగుతోంది. వస్తే వెయ్యి.. పోతే వంద' అన్న చందంగా పందెం కాస్తున్నారు. ఏ జట్టు గెలుస్తుంది? ఎవరూ ఎన్ని పరుగులు చేస్తారు? ఏ ఓవరులో సిక్స్ కోడుతారు? అని పందెం కాస్తున్నారు. ఈ తతంగం అంతా ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో సాగుతోంది. బెట్టింగ్ మాయాలో పడి యువకులు ఆర్థికంగా నష్టపోతున్నారు. కొన్ని సందర్భాల్లో అప్పుల పాలై ఆత్మహత్య చేసుకుంటున్నారు. మ్యాచ్ స్టార్ట్ అయితే చాలు ఎక్కడా చూసినా బెట్టింగ్ ముచ్చట్లే. ఈ వాలెట్లతో లావాదేవీలు నిర్వహిస్తూ.. నష్టపోతున్నారు.

ఆకర్షితులవుతున్న యువత..

స్మార్ట్‌ఫోన్ వాడడం తెలిసిన యువత, విద్యార్థులు ఐపీఎల్ బెట్టింగ్‌కు ఆకర్షితులవుతున్నారు. తల్లిదండ్రులు ఇచ్చే ప్యాకెట్ మనీతో రహస్యంగా బెట్టింగ్ పెడుతున్నారు. మ్యాచ్ జరిగేటప్పుడు ఇంట్లో టీవీ ముందు కూర్చుని సెల్‌ఫోన్ ద్వారా బెట్టింగ్ కాస్తున్నారు. తమ పిల్లలు క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న విషయం తల్లిదండ్రులకు తెలిసే సమయానికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది.

బెట్టింగ్ నడుస్తున్న తీరు ఇలా..

వేసవిలో పాఠశాలలు, కాలేజీలకు సెలువు ఇవ్వడంతో యువత ఇంట్లో ఖాళీగా ఉంటున్నారు. క్రికెట్ మ్యాచ్ ప్రారంభంతో వీరికి వినోదం లభిస్తోంది. యువత వినోదంతో పాటు విషాదాన్ని కొని తెచ్చుకుంటున్నారు. స్మార్ట్‌ఫోన్లో తెలిసిన వారితో బెట్టింగు పాల్పడుతున్నారు. ఈ తతంగం అంతా చైన్ సిస్టంలా సాగుతోంది. మహారాష్ట్ర ముంబై కేంద్రంగా జిల్లాలోనూ బెట్టింగ్ మాఫియా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. వాట్సాప్, టెలిగ్రామ్, ప్రత్యేక యాప్‌ల ద్వారా బెట్టింగ్ బుకీలు ఆఫర్లు విసురుతున్నారు. ఈ- వ్యాలెట్ల ద్వారా సొమ్ము లాగి క్రికెట్ మ్యాచ్ ప్రారంభం నుంచి చివరి బాల్ వరకు బెట్టింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. ఉత్కంఠ భరితంగా మ్యాచ్ నడిచే సందర్భాల్లో కొన్ని రెట్లు అధికంగా లాభం రావడానికి అప్పటికప్పుడు నిర్ణయం మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. దీంతో వందలో ఒకరిద్దరికి లాభం చేకూరితే మిగతా 95 మంది ఆర్థికంగా నష్టపోతున్నారు.

అడ్డుకట్ట వేయాలి

వేసవి సెలవులు, ఐపీఎల్ మ్యాచ్‌లు నడుస్తుండడంతో యువతకు వినోదం లభిస్తుంది. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండడంతో తల్లిదండ్రులు ఇచ్చే ప్యాకెట్ మనీని బెట్టింగ్ వాడుతున్నారు. ఇలాంటి వాటికి బానయ్యే అవకాశం ఉంది. తల్లిదండ్రులు పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలి.

– గిత్తే మదన్, సామాజిక కార్యకర్త, గుడిహత్నూర్

భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

క్రికెట్ మ్యాచ్‌లను కేవలం వినోదం కోసమే చూడాలి. బెట్టింగ్‌లను పాల్పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దు. ఆటను ఆస్వాధించాలే తప్పా.. పందాలు కాయొద్దు. ఎవరైనా బెట్టింగ్ నిర్వహిస్తే, పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయి. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.

– ప్రవీణ్ కుమార్, ఎస్సై

అన్నివార్డుల్లో అభివృద్ధి పనులు

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. వార్డు వాచ్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 34వ వార్డు పరిధిలోని శాంతినగర్‌లో పర్యటించారు. కాలినడకన తిరుగుతూ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు, తాగునీరు, విద్యుత్ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పనులను పరిశీలించి, అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో భాగంగా అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కోట్లాది రూపాయల నిధులతో పట్టణ సుందరీకరణతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంతోశ్, మహేశ్, సానిటరీ ఎస్సై నరేందర్, తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న జోగు ప్రేమేందర్

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

నేరడిగొండ: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. మండల కేంద్రంలో గత 15 రోజుల నుంచి నిర్వహిస్తున్న నేరడిగొండ ప్రీమియర్ లీగ్ (ఎన్‌పీఎల్) ముగింపు సందర్భంగా గురువారం గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. నేరడిగొండ మండలానికి చెందిన యూత్ సభ్యులకు తనవంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంట వెంకట రమణ, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్, కాంగ్రెస్ నాయకులు ఆడే గజేందర్, ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దావుల భోజన్న, తొడసం శంకర్, నూర్‌సింగ్, పవన్, క్రీడాకారులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న బలరాం జాదవ్

‘డయల్ యువర్ డీఎం’కు విశేష స్పందన

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో గురువారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. డిపో పరిధిలోని ప్రయాణికులు వివిధ సమస్యలను డీఎం కల్పన దృష్టికి తీసుకురాగా ఆమె వాటిని నమోదు చేసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ మండలం లాండ్‌సాంగ్ గ్రామం నుంచి గంగన్న ఆదిలాబాద్ నుంచి లాండ సాంగ్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా.. ప్రయాణికుల స్పందన చూసి బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. బేల నుంచి వసంతరావు మాట్లాడుతూ.. సైద్‌పూర్ నుంచి బేల వరకు బుధవారం రోజున ఉదయం 9:30 సాయంత్రం 4:00 గంటలకు రెండు ట్రిప్పుల బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. శంకర్ గౌడ్ అనే ప్రయాణికుడు మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి తిరుపతికి బస్సు సౌకర్యం కల్పించమని అడుగగా.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. ఉట్నూర్ నుంచి గంగాధర్ రావు మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి ఉట్నూరు వరకు నాన్ స్టాప్ 2 ట్రిప్పులు ఉదయం 8:30 నుంచి 9 గంటల మధ్య అదే విధంగా సాయంత్రం 6 గంటలకు లేదా 6:30 గంటలకు బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించగా.. ప్రయాణికుల అభిప్రాయ సేకరణ అనంతరం బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం కల్పన

ఈ నెల 31 వరకు మొక్కజొన్న కొనుగోళ్లు



కొనుగోళ్లను పరిశీలిస్తున్న అధికారులు

బోథ్: బోథ్‌లోని కొనుగోలు కేంద్రంలో ఈనెల 31 వరకు మొక్కజొన్న కొనుగోళ్లు చేపడుతామని మార్కెట్ ఏడీ శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్ రెడ్డిలు తెలిపారు. గురువారం కొనుగోళ్లను వారు పరిశీలించారు. సజావుగా కొనుగోళ్లు జరుగుతున్నాయని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: పవిత్ర హజ్‌యాత్రకు వెళ్లేవారు ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో సంఘ భవనంలో హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హజ్‌యాత్రకు వెళ్లేవారు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. హజ్ సొసైటీ భవనం రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, షాహిద్ అహ్మద్, ఆసిఫొద్దీన్, నూర్‌ఖాన్, ఫారుఖ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న కంటికి ఇటీవల చిన్న గాయం కాగా మాజీ ఎంపీ గోడం నగేశ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిలు కలిశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు తాటిపెల్లి రాజు, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు.

సభ విజయవంతం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో జూన్ 6న నిర్వహించే రిపబ్లిక్ మంచ్ సభను విజయవంతం చేయాలని దళిత సంఘం రాష్ట్ర నాయకులు జాడే నాగోరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బౌద్ధ వీహార్‌లో వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలు, బహుజనుల ఐక్యత కోసం సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సభకు అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేశవ్ కర్మాన్కర్, సందీప్, నగేశ్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: జిల్లా కేంద్రంలో రాంలీలా మైదానంలో జూన్ 6న నిర్వహించే బహిరంగ సభ కరపత్రాలు బహుజన నాయకులు, అంబేద్కర్ అసోసియేషన్ నాయకులు రత్న జాడె, ప్రగ్న కుమార్, నాగసేన్‌లు గురువారం ఉట్నూర్‌లో ఆవిష్కరించారు. బహిరంగ సభకు బాబా సాహెబ్ అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ వస్తున్నట్లు తెలిపారు. బండి విజయ్, సుభాశ్, వెంకటేశ్, పోషన్న, రాజేశ్వర్, సందీప్, సురేందర్, కేశవ్, ప్రవీన్ పాల్గొన్నారు.

దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేయాలి

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో దివ్యాంగుల కోసం నూతన కాలనీ ఏర్పాటు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీ పార్కులో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. నూతన కాలనీ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో 2014లో ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట 103 రోజుల పాటు ధర్నా చేశామన్నారు. ఆ సమయంలో ఎమ్మెల్యే జోగు రామన్న నూతన కాలనీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అయినా ఇప్పటి వరకూ కాలనీ ఏర్పాటు చేయలేదన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు ఎండీ.ఇమ్రాన్, నీత, జ్యోతి, దాసరి లలిత, లత, షాకీర్, మన్సూర్, సాజిద్, కలీల్ పాల్గొన్నారు.



గాంధీ పార్కులో సమావేశమైన దివ్యాంగులు

‘కంటివెలుగు’ సద్వినియోగం చేసుకోవాలి

బజార్‌హత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మడవి ప్రకాష్ తెలిపారు. గురువారం మండలంలోని మాడగూడలో కంటివెలుగు కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నరేశ్, పంచాయతీ కార్యదర్శి భీంసింగ్, సిబ్బంది గాజుల రమేశ్, శంకర్, ఆరాధన, మంజుల, పార్వతి, వెంకటేశ్ పాల్గొన్నారు.

‘శనగ డబ్బులు విడుదల చేయాలి’

జైనథ్: ఆదిలాబాద్ జిల్లాలో మార్క్‌ఫెడ్‌కు శనగలు అమ్మిన 48 మంది రైతులకు ఇప్పటి వరకు డబ్బులు జమ కాలేదని, బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఏనుగు రాకేష్ రెడ్డి అన్నారు. మూడు నెలల సమయం గడుస్తున్నా.. ఇప్పటికీ డబ్బులు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఖరీఫ్‌లో పెట్టుబడికి డబ్బులు లేక అవస్థలు పడుతున్నారని, జిల్లా కలెక్టర్ చొరవ చూపి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని కోరారు. ఆయన వెంట నాయకులు సిడాం రాకేశ్, సురేశ్‌రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పకడ్బందీగా చేపట్టాలి

తాంసి: ఉపాధిహామీలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న పనులను అధికారులు పర్యవేక్షిస్తూ పకడ్బందీగా చేపట్టాలని డీఆర్‌డీఏ కిషన్ మండల అధికారులు సూచించారు. గురువారం మండలంలోని పొన్నారి గ్రామంలో ఉపాధి పనులను ఎంపీడీవో భూమయ్యతో కలిసి పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బిల్లులు రావడం లేదని కూలీలు చెప్పడంతో కూలీ డబ్బులు అందేలా చూస్తామన్నారు. అనంతరం నర్సరీ, ప్రకృతివనం పరిశీలించడంతో పాటు ఫించన్ డబ్బుల పంపిణీని సైతం పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రఘు, ఉప సర్పంచ్ అశోక్, ఏపీవో విజయ, ఫీల్డ్ అసిస్టెంట్ రాకేశ్, పంచాయతీ కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ కిషన్

15 రోజుల పాటు డయేరియా నియంత్రణ పక్షోత్సవాలు

జైనథ్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు సబ్‌సెంటర్ కేంద్రాల్లో 15 రోజుల పాటు డయేరియా నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ నైనతా తెలిపారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ 5 సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులకు ఓఆర్‌ఎస్, జింక్ ట్యాబ్లెట్లు, విటమిన్ ఏ సిరప్‌లు అందించడం జరుగుతుందన్నారు. గురువారం పీహెచ్‌సీలో చిన్నారులకు జింక్ ట్యాబ్లెట్లు, విటమిన్ ఏ సిరప్‌లు అందించారు.

బడీడు పిల్లలను బడికి పంపించాలి

తాంసి: బడీడు పిల్లలను బడికి పంపించాలని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రత్యేకాధికారి ప్రశాంత్ రెడ్డి అన్నారు. గురువారం భీంపూర్ మండలంలోని గుంజాల గ్రామాన్ని సీఆర్‌పీ రవీందర్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంజాల గ్రామానికి చెందిన విద్యార్థులు పైతరగతులకు వెళ్లే క్రమంలో ఇతర పాఠశాలలకు వెళ్లలేక చదువు మధ్యలోనే మానేస్తున్నారని గుర్తించడం జరిగిందన్నారు. ఉచిత బోధన, హాస్టల్ వసతి ఉన్న జిల్లా కేంద్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట గ్రామస్తులు, విద్యార్థులు ఉన్నారు.



వివరాలు సేకరిస్తున్న ప్రత్యేకాధికారి

దుర్వగూడను సందర్శించిన అధికారులు

ఇంద్రవెల్లి: మండలంలోని మెండపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని దుర్వగూడ గ్రామంలో నెలకొన్న నీటి సమస్యలపై ‘దుర్వగూడలో నీటి కష్టాలు’ అనే శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీకాంత్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి దుర్వగూడ గ్రామానికి సందర్శించారు. నీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పైప్‌లైన్ మరమ్మతులు చేయించి దుర్వగూడ గ్రామస్తులకు తాగునీరు అందిస్తామని పేర్కొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..



పైప్‌లైన్ లీకేజీని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీకాంత్‌రెడ్డి

బోథ్‌లో వాట్సాప్ వార్..

- ఎంపీపీ తుల శ్రీనివాస్, ఎమ్మెల్యే వర్గీయుల మధ్య సవాళ్లు

బోథ్: బోథ్ బీబీఆర్‌ఎస్‌లో వర్గవిబేధాలు తారాస్థాయికి చేరాయి. ఈనెల 24న ఆదిలాబాద్‌లో నిర్వహించిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ తుల శ్రీనివాస్ బోథ్ మండలంలోని చింతల్‌బోరి గ్రామంలో దళితబంధులో అక్రమాలు జరిగాయని, డబ్బులు తీసుకుని దళితబంధు ఇచ్చారని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు వర్గంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీంతో ఎమ్మెల్యే వర్గీయుడైన వైస్ ఎంపీపీ లింబాజీ వాట్సాప్‌లో ఓ వీడియో విడుదల చేశారు. ఓపని నిమిత్తం ఎంపీపీ శ్రీనివాస్‌కు రూ.50 వేలు ఇచ్చానని, పనిచేయకపోగా డబ్బులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎంపీపీ అనుచరులు వైస్ ఎంపీపీపై వాట్సాప్ వేదికగా విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైస్ ఎంపీపీ లింబాజీ రూ. 3 లక్షలు డిమాండ్ చేశారని మండిపడ్డారు. ఇచ్చిన కాంట్రాక్టు పని కూడా చేయడం లేదని లంబాడాతండా సర్పంచ్ బాబుసింగ్ విమర్శించారు. అయితే బీఆర్‌ఎస్ నాయకులు ఇలా వాట్సాప్ వేదికగా రచ్చకెక్కడంతో కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు.

రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరికీ అందించాలి

బోథ్: భారత రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరికీ ఉచితంగా అందించాలని ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ నాయకులు వెంకటేశ్ మహరాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ అతికోద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గణేశ్, రమేశ్, రాకేశ్, శేఖర్, రఘువీర్, ప్రసాద్, గంగాధర్, అనిల్, నరేశ్, లక్ష్మణ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగ గ్రంథాలను ప్రతిఒక్కరికి ఉచితంగా పంపిణీ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) సభ్యులు సర్కిల్ నరేష్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని డిప్యూటీ తహసీల్దార్ హీరాలాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, నగేష్, విలాస్, రమేష్, శేఖర్, గణేష్, గంగయ్య, ప్రవీణ్, లక్ష్మణ్, అఖిల్, మహేష్, కార్తీక్, రవి పాల్గొన్నారు.

ఘనంగా బీరన్న పట్నాలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హనుమాన్‌నగర్‌లో బీరన్న పట్నాలను గురువారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ చారులత రాథోడ్ హాజరయ్యారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. పలు సమస్యలను జెడ్పీటీసీ దృష్టికి తీసుకురాగా త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బుగొండ బీరయ్య, ఇరుముల రాజన్న, ఇరుముల మల్లేశ్, నారాయణ, సిద్దయ్య, రాజు పాల్గొన్నారు.



పాల్గొన్న జెడ్పీటీసీ చారులత రాథోడ్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899